# నవ్యావధానం

సాహిత్యానికి సంబంధించిన గొప్ప ఐ.క్యూ టెస్ట్ అష్టావధానం, ప్రపంచ సాహిత్యంలో మరెక్కడా లేని ఈ ప్రక్రియ ఆంధ్రుడి సొత్తు.. అష్టావధానికి ప్రధానంగా కావలసినవి సమయస్ఫూర్తి, జ్ఞాపకశక్తి. శ్యామశాస్త్రి ప్రసిద్ధి చెందిన అష్టావధాని. ధారణ విషయంలో అతనిది పెద్ద పీట. ధారణ అంటే జ్ఞాపకశక్తి.

సభ క్రిక్కిరిసి పోయి ఉంది. వేదిక మీద అవధానీ, పృచ్ఛకులూ, అర్ధచంద్రాకార మండలంగా కూర్చున్నారు. అవధానికి ప్రశ్నలూ, సమస్యలూ యిచ్చే ఎనిమిదిమంది పండితుల్ని పృచ్ఛకులంటారు.

"అప్రస్తుత ప్రసంగం" చేసే పండితుడొకాయన వుంటాడు. ప్రస్తుతమో, అప్రస్తుతమో మధ్య మధ్య కొన్ని కొన్ని చిలిపి ప్రశ్నలు అడుగుతూ వుంటాడాయన. ఓపికతో, చమత్కారంగా ఆయన నోరు మూయించేట్టుగా వాటికి సమాధానాలు చెప్పాలి అవధాని.

1) **అప్రస్తుత ప్రశంస :** అవధానిగారూ! మా ఎనిమిది మందిని యిలా ఎదురుగా చూస్తుంటే, మీ గుండె ఎలా కొట్టుకుంటోందండి?

**సమాధానం :** ప్రౌఢమైన అష్టభార్యల మధ్యనున్న శ్రీకృష్ణుడి గుండె ఎలా కొట్టుకుంటుందో అలా కొట్టుకుంటోందండి.

చప్పట్లు మ్రోగిపోయాయి.

2) **నిషిద్ధాక్షరి :** అవధాని ముందుగా పద్యంలోని ఒక అక్షరం చెప్తాడు. ఎదురుగా వున్న ఇంకో పృచ్ఛకుడు అవధాని తర్వాత చెప్పబోయే అక్షరాన్ని ఊహించి ఆ అక్షరం వాడకూడదని నిషేధిస్తాడు. ఆ అక్షరం వాడకుండా మరో అక్షరం వాడాలి అవధాని. మళ్ళీ తర్వాత అక్షరాన్ని ఊహించి, నిషేధిస్తాడు పృచ్ఛకుడు. ఈ విధంగా నిషేధిస్తున్న ప్రతి అక్షరాన్ని వదిలిపెట్టి వేరే అక్షరం వాడుతూ పద్యం పూర్తి చెయ్యాలి అవధాని.

పద్యం పూర్తయింది. భారతమాత యువకులకిచ్చే సందేశం మీద పద్యం.

**సమాధానం :**

మీకున్ మేకో బాబూ!
వాకున్ బాగై రహింస, స్వకువున్ రక్తిన్
చేకో పెంపన్, ప్రీతిన్
శ్రీకంబై లోకమంచు చెలగున్ యశమున్

3) **దత్తపది :** బోళా, వేళా, మాలా, పాలా అనే మాటలు వరుసగా నాలుగు పాదాల్లో వాడి, కంద పద్యంలో శివ ప్రార్థన చెయ్యాలి.

సమాధానం : బోళా శంకరుడనుటయు
వేళాకోళమ్ము, వట్టి వేడుక మాటే!
మాలా కంభరు శిరముల్
పాలాడుకొనిన తదుపరి పాలించుటచే!

4) **సమస్య :** షండుని తోడనె సుఖించు సాధ్వీమణియున్

సమస్యాపూరణ : కుండెడు కల్లును త్రావియు
రండలతో తిరిగి, చేరు రాత్రికి దౌర్భా
గ్యుండిల్లు, చిత్ర మా పా
షండుని తోడనె సుఖించు సాధ్వీ మణియున్

5) **వర్ణన :** అందమైన కాలేజి అమ్మాయిని చూసిన ఒక కాన్వెంటు పిల్లవాడు, ఒక యువకుడు, ఒక వృద్ధుడు, ఒక వేదాంతియు వీళ్ళ మనోభావాలు ఎలా వుంటాయో వర్ణించాలి.

సమాధానం : "అక్క! ఏ స్కూలు మీదంచు అడుగు బాలు
డతివ పొందని బ్రతుకేల యనుచు యువకు
డీ వయస్సున కన్నడె నేమి యంచు
ఏడ్చువృద్ధుడు, వేదాంతి యీసడించు

6) న్యస్తాక్షరి : ప్రతి పాదంలో పృచ్ఛకుడు చెప్పినచోట చెప్పిన అక్షరం ఉంచుతూ, పద్యం పూర్తి చెయ్యాలి. ఆంజనేయ ప్రార్ధన. ప్రతీ పాదంలో మొదటి అక్షరాలు మం, ట్వాం, త్తుం, ర్వాం వుండాలి.

సమాధానం :

మంగళరూప! దీప! హనుమంత! మహాబల! వంచవ క్త్ర! ఖ
ట్వాంగ, మహాసి, ఖేట, కుధరా, మృతకుంభ, సృణప్రదీపి తో
త్తుంగ కరాంబుజాత! నవ తోయదమూర్తి! త్రిపంచ నేత్ర ! స
ర్వాంగద కంఠహార! అమరావలి మర్దన బాహు! మారుంతీ



7) **గంటలు :** అష్టావధానం జరుగుతూ వుండగా, పృచ్ఛకుల్లో ఒకరు అప్పుడప్పుడు కొన్ని గంటలు కొడుతూ వుంటారు చివరికవి అన్నీ ఎన్నో చెప్పాలి.

సమాధానం : ముప్పై రెండు గంటలు సరిపోయాయి.

8) **పురాణ పఠనం :** పాత కావ్యాల్లోంచి కొన్ని పద్యాలు చదువుతాడొక పృచ్ఛకుడు, అవి ఏ కావ్యాల్లోవి, వాటి అర్థాలు చెప్పాలి.

అవధాని అన్నీ చెప్పాడు. సభ దిగ్విజయంగా, చప్పట్లతో మారుమ్రోగిపోయింది. శ్యామశాస్త్రి యొక్క అసాధారణమైన ధారణాశక్తిని పొగుడుకుంటూ అంతా నిష్క్రమించారు.

శ్యామశాస్త్రి ఇంటికి బయలుదేరాడు.

"చూశావుటోయ్ మన ధారణ"! అన్నాడు శ్యామశాస్త్రి సన్మానం తాలూకు శాలువా, పూలదండలూ, వెయ్యిన్నూటపదహార్లూ భార్యకు చూపిస్తూ.

"చాల్లెండి సంబడం, నేనూ చేస్తూనే ఉన్నాను, రోజూ అవధానం ఒక్క పక్క పనిమనిషి, పాలమనిషి, ఇంకో పక్క పిల్లల స్కూలు వేళ, మీ అమ్మగారికి మూడోసారి కాఫీ, ఇటుపక్క వంట, అటు తమరికి కాలేజీకి బనీను దగ్గరి నుంచి అందివ్వడం. మరోవైపు కరెంటు పోయి ఛస్తుంటే పక్కావిడ పంచదార అప్పు, అయ్యగారు కాలేజికి వెళుతూ మధ్యలో కాస్త శృంగారం, నేనూ చేస్తూనే వున్నాను రోజూ అవధానం.

అవధానంలో కాదు తమ ధారణ. కొంపలో చూపించండి. చిన్న వాడికి "వైట్‌షూస్" లేవండి, స్కూల్లో కేకలేస్తున్నారు. అని వారం రోజుల బట్టీ చెపుతూంటే, ఇదిగో ఇదిగో అని రోజూ మర్చిపోవడమే!" బాదేసింది భార్యామణి.

అప్పటిదాకా ఆకాశంలో ఎటుపడితే అటు తిరిగిన పొద్దు తిరుగుడుపువ్వు, చంద్రుడు రాగానే, నేలకేసి చూడసాగింది పాపం!!